క్లుప్తంగా

వార్డెన్‌ను నియమించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: వసతిగృహానికి వార్డెన్‌ను నియమించాలని ఏపీ పురం బీసీ బాలుర వసతిగృహం విద్యార్థులు ఎమ్మెల్యే కంబాల జోగులును కోరారు. వసతిగృహాన్ని ఎమ్మెల్యే బుధవారం సందర్శించి మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సమయంలో విద్యార్థులు మాట్లాడుతూ, రెగ్యులర్ వార్డెన్ లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పాగా.. వెంటనే నియమించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్ చుక్కా వెంకటనాయుడు, తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వంగర విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం రమణమ్మ, ఉపాధ్యాయులు

వంగర: రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు వంగర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ తెలిపారు. వాలీబాల్, హైజంప్, కబడ్డీ, రన్నింగ్, ట్రిపుల్ జంప్ విభాగంలో బొడ్రోతు ప్రవీణ్, అచ్యుత్, కొమరాపు చందు, బొడ్రోతు సౌమ్య, దేవకివాడ అశోక్, దేవకివాడ కార్తీక్, చిలక సాగర్, తదితర విద్యార్థులు ఎంపిక కావడంపై బుధవారం అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

వంగర: మండల పరిధి అరసాడ జంక్షన్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న పరస జగదీశ్వరరావును అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఆర్.జనార్దనరావు తెలిపారు. బుధవారం తనిఖీలు చేపట్టగా 25 మద్యం బాటిళ్లతో నిందితుడు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించాలి

- ఎంఈఓ ఎరకయ్య



విద్యార్థుల వివరాలపై ఆరా తీస్తున్న ఎంఈఓ ఎరకయ్య

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించాలని మండల విద్యాశాఖాధికారి బి. ఎరకయ్య ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని సంకిలి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరుపట్టీని పరిశీలించారు. జగనన్న గోరుముద్ద సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: మహిళలు తమ ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు సూచించారు. మండలంలోని లచ్చారాయపురంలో మహిళలు, కిశోర బాలికలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీఎంటి. మంగమ్మ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం రేపు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని ఈనెల 6న నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు బుధవారం తెలిపారు. పట్టణంలోని శ్రీసూర్య రెసిడెన్సీలో నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరువుతారని వెల్లడించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

● ప్రజారోగ్యమే లక్ష్యం..



రేగిడి : ఏపీ పురంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగ బలోపేతానికి విశేష కృషి చేస్తోంది.. ఇప్పటికే ఆస్పత్రులను అన్ని విధాలుగా బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తోంది. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా మెరుగైన వైద్యం అందించాలనే ముఖ్య ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సచివాలయాల పరిధిలో వైద్యశిబిరాలు నిర్వహించి, రోగులకు నిపుణులైన వైద్యులచే సేవలందిస్తోంది. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో బుధవారం వైద్య శిబిరాలు నిర్వహించగా.. వాటిని స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. వందలాది మంది రోగులను వైద్యులు పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అలాగే మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేశారు.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్



రాజాం : బొద్దాంలో ఇంటి వద్దనే వృద్ధుడికి వైద్యం చేస్తున్న సిబ్బంది



రామభద్రపురం: రామభద్రపురం సచివాలయం -3లో నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు



వంగర: రాజులగుమ్మడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులను పరిశీలిస్తున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, అధికారులు.



బాడంగి: కోటిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్న ఎంపీపీ భోగి గౌరి, స్థానిక ప్రజాప్రతినిధులు



సంతకవిటి: చిత్తారపురంలో రోగికి ఈసీజీ తీస్తున్న వైద్య సిబ్బంది



తెర్లాం: గంగన్నపాడులో జరిగిన జేఏఎస్ శిబిరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు, పక్కన ఎంపీడీఓ రామకృష్ణ



మెంటాడ: లోతుగెడ్డలో ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలందిస్తున్న వైద్యుడు



బొబ్బిలి: జగన్నాథపురంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పోతుల రవికుమార్, తదితరులు

ఔత్సాహిక రైతులకు ప్రోత్సాహం

- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, తదితరులు

రేగిడి: ఔత్సాహిక రైతులను వ్యాపార శైలిలో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఉణుకూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గ్రామీణ స్థాయిలో పశుపోషణ ద్వారా ఆర్థిక పురోగతి సాధించేందుకు జాతీయ లైవ్ స్టాక్ మిషన్ నిధులతో ఔత్సాహిక రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. రైతులకు రాయితీపై గొర్రెలు, మేకలు, కోళ్లు, పందులు, పశుగ్రాసం, దాణా తయారీ పరిశ్రమల సామగ్రి ఇస్తున్నట్లు తెలిపారు. 500 గొర్రెలు, 25 పొట్టేళ్ల యూనిట్‌కు కోటీ రూపాయల రుణం ఇస్తున్నామని, ఇందులో 50 లక్షల రూపాయలు రాయితీ ఉంటుందన్నారు. అంతకంటే తక్కువ యూనిట్‌లకు ప్రాజెక్ట్ విలువలో 50 శాతం రాయితీ ఇస్తున్నామని వివరించారు. కోళ్ల అభివృద్ధి పథకంలో గరిష్ఠంగా 50 శాతం రాయితీ ఉందన్నారు. పందుల యూనిట్‌లో వంద ఆడ, పది మగ పందులతో కూడిన యూనిట్‌కు రూ. 60 లక్షల గరిష్ఠ రుణం ఇచ్చి, 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న రైతులు ఆధార్, రేషన్ కార్డు, ధ్రువపత్రాలతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంకిలి ఎంపీటీసీ సభ్యుడు మజ్జి శ్రీనివాసరావు, కొమెర సర్పంచ్ పాడి లక్ష్మున్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పారాది వంతెన పరిశీలన



వంతెన కుంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మండలంలోని పారాది వద్ద వేగావతి నదిపై ఉన్న వంతెనను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు బుధవారం పరిశీలించారు. ఇటీవల వంతెనపై రోడ్డు కొద్దిగా కిందకు కుంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆ ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించిన సంబంధిత అధికారులతో మాట్లాడారు. త్వరగా మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అలాగే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసకువెళ్లి కొత్త వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆర్అండ్‌బీ ఈఈ జీవీ రమణ వంతెన కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. కొద్దిరోజుల్లో మరమ్మతులు పూర్తిచేసి వాహనాల రాకపోకలకు వీలుగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గొర్లె సీతారామపురం వద్ద పాడైన రోడ్డును పరిశీలించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు ఉన్నారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రమామణి

రామభద్రపురం: గ్రామాభివృద్ధికి కావాల్సిన ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ రమామణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ వెంకటరమణతో కలిసి పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించడంతో పాటు వాటిని చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు.

ఇంకుడు గుంతల తవ్వకానికి చర్యలు



ఇంకుడు గుంత తవ్వకానికి కొలతలు వేస్తున్న సిబ్బంది

బాడంగి: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయం ప్రాంగణంలో ఇంకుడు గుంతలు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఏపీఓ విజయలక్ష్మి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఇంకుడుగుంత నిర్మాణానికి బుధవారం కొలతలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 12 అడుగు పొడవు, వెడల్పు, లోతుతో ఇంకుడుగుంత నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధి నిధుల నుంచి రూ.43 వేల వరకు బిల్లు చెల్లించనున్నట్టు చెప్పారు. వర్షం నీటిని వృథాగా పోనివ్వకుండా భూమిలోనికి ఇంకింపజేసి భూగర్భజలాలను పెంచేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందన్నారు. ఆమెతో పాటు ఈసీ బుజ్జీ, టెక్నికల్ సహాయకులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'

- జేసీ మయూర్ అశోక్



అధికారులు వద్ద మొరపెట్టుకుంటున్న డ్వాక్రా సంఘాల మహిళలు

రాజాం సిటీ: సమస్యల సత్వర పరిష్కారానికే జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామని జేసీ మయూర్ అశోక్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజాం మండలానికి సంబంధించి నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన సమస్యలన్నింటినీ మండల స్థాయి అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు.

ఆర్పీలపై దర్యాప్తు నిర్వహించండి....

మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన మెప్మా ఆర్పీలపై దర్యాప్తు నిర్వహించాలని ఆ గ్రామ మహిళలు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జేసీ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామానికి చెందిన ఆర్పీలు ఎస్.ఉమాదేవి, పి.సంధ్య అవకతవకలకు పాల్పడి గ్రామైక్య సంఘాల సభ్యులకు తెలియకుండా లోన్లు చేయించుకున్నారని వివరించారు. దీంతో తీవ్రంగా నష్టపోయామని, వారి నుంచి డబ్బులు రికవరీ చేయడంతోపాటు వారిపై చర్యలు తీసుకోవాలని జేసీ మయూర్ అశోక్, మెప్మా పీడీ సుధాకర్‌లను కోరారు. ఇందుకు స్పందించిన పీడీ ఈ నెల 6న గ్రామంలో మూడు బృందాలతో దర్యాప్తు చేపడతామన్నారు. ఆర్పీలు తప్పు చేసినట్లు నిరూపణ జరిగితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో చీపురుపల్లి ఆర్డీఓ ఎం.అప్పారావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై ఆర్.రమేష్

తెర్లాం: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్సై ఆర్.రమేష్ సూచించారు. మండలంలోని నెమలాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాకు ఆకర్షితులై చదువులను నిర్లక్ష్యం చేస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటర్నెట్‌ను విజ్ఞానం కోసం మాత్రమే వినియోగించాలని, బెట్టింగ్‌లు, కాలక్షేపం, గేమ్స్ ఆడేందుకు వినియోగించొద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వెంకటయ్య

రామభద్రపురం: పత్తిపంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ వెంకటయ్య అన్నారు. మండలంలోని కొండకెంగువ గ్రామంలో సాగులో ఉన్న వివిధ రకాల పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. పత్తి పంట సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటను ఆశించే గులాబి రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పురుగు ఉధృతిని బట్టి ఎకరానికి 15 వరకు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాయకుళ్లు తెగులు నివారణకు ట్రెప్టోసైకిలిన్ 0.1 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

జీవామృతంతో చీడపీడల నివారణ



రేగిడి : చాటాయవలసలో జీవామృతాన్ని తయారు చేసి రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి సేద్యం సిబ్బంది

రేగిడి: రైతులు సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలకు ఆశించే చీడపీడలను నివారించేందుకు జీవామృతం ఎంతో ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయం విభాగం ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు అన్నారు. మండలంలోని చాటాయవలసలో రైతులకు జీవామృతం తయారీపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవామృతాన్ని తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న అవగాహన సదస్సులను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, గుండాల రవి, పాదిలావు సురేష్, కూనుబిల్లి రమణ, రెడ్డి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

తయారీపై అవగాహన..

రాజాం: మండలంలోని గార్రాజు చీపురుపల్లి యూనిట్ పరిధి బొద్దాం గ్రామంలో రైతులకు జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఎస్ఎఫ్ రేఖ, మాస్టర్ ట్రైనీ కిరణ్‌ల ఆధ్వర్యంలో గ్రామనికి చెందిన గోపి అనే రైతు పొలంలో ల్యాబ్ అండ్ ఓహెచ్ఎస్ బయోకల్చర్‌పై అవగాహన కల్పించడంతో పాటు బోరాన్ తయారీపై వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు

బాడంగి: బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతినదిపై నిర్మించిన వంతెన కుంగిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో విజయనగరం, విశాఖ, పార్వతీపురం, బొబ్బిలి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన వాహనాలను బాడంగి మీదుగా దారిమళ్లించడంతో బాడంగి మెయిన్‌రోడ్డుపై రద్దీ ఏర్పడింది. ట్రాఫిక్ జాం అవడంతో పోలీసులు కలుగజేసుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. భారీ వాహనాలు, ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆకులకట్ట మీదుగా బొబ్బిలి, పార్వతీపురం వైపు, అటు నుంచి వచ్చిన బస్సులను ముగడకాలనీ, బాడంగి మీదుగా రామభద్రాపురం చేరుకునేలా చర్యలు చేపట్టారు.

సంక్షిప్తంగా...

చింతాడలో గ్రామసభ

బొబ్బిలి: మండలంలోని చింతాడ గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ ఏడాది గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వాటి ప్రణాళికలపై చర్చించి తీర్మానాలు చేశారు. అనంతరం ఎంపీడీఓ పోతుల రవికుమార్ ఆధ్వర్యంలో మేరీ మాటీ-మేరీ దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతీ ఇంటి నుంచి పిడికెడు బియ్యం, మట్టిని సేకరించారు.

కొత్త వంతెన నిర్మించాలి

బొబ్బిలి: మండలంలోని పారాది వద్ద ఉన్న వంతెనకు మరమ్మతులు చేయించినప్పటికీ మళ్లీ కుంగిపోవడం దారుణమని, అసలు టీడీపీ హయాంలోనే వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి వదిలేశారని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పారాది వంతెనను త్వరగా మరమ్మతులు చేసి వాహనాల రాకపోకలకు అనుమతించాలని, అలాగే వేగవతి నదిపై కొత్త వంతెనను నిర్మించాలని ఆయన కోరారు.

పోస్టల్ సేవలకు అంతరాయం

బాడంగి: అఖిలభారత గ్రామీణ తపాలాశాఖ జీడీఎస్ ఉద్యోగ సంఘం పిలుపుమేరకు పోస్టల్ సిబ్బంది బుధవారం ఒక్కరోజు సమ్మెలో పాల్గొన్నారు. దీంతో మండలంలోని పోస్టాఫీసు శాఖలన్నీ మూతపడ్డాయి. పోస్టల్ సిబ్బంది అంతా సాలూరు డివిజన్ పోస్టాఫీస్ వద్ద నిర్వహించిన సమ్మెలో పాల్గొనేందుకు వెళ్లడంతో పోస్టల్ సేవల కోసం వచ్చిన వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండొచ్చని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండలంలోని గంగన్నపాడులో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార శిబిరాన్ని ఆయన సందర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వండిన వంటలను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో లోచర్ల సెక్టార్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనాలు



ఆకట్టుకున్న మహిళల కోలాటం

రాజాం సిటీ: రాజాం పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణ పరిధి పొనుగుటివలస గ్రామంలో ఏర్పాటు చేసిన మహిళల కోలాటం ఆకట్టుకుంది. అలాగే మండలంలోని మొగిలివలస, బొద్దాం, తదితర గ్రామాల్లో మందుగుండు సామగ్రి, మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లి సర్పంచ్‌గా, ఎంపీటీసీగా సేవలందించిన గొట్టాపు అప్పలనాయుడు బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు గ్రామనికి వెళ్లి అప్పలనాయుడు భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట శంబంగి వేణుగోపాలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రతీ రైతు ఈ-క్రాప్ చేసుకోవాలి

బొబ్బిలి: ఖరీఫ్, రబీ సీజన్లలో పంటల సాగు చేస్తున్న రైతులంతా తాము సాగుచేస్తున్న పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవడంతో పాటు ఈకేవైసీని చేయించుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని పక్కి గ్రామంలో తాను సాగుచేస్తున్న పంటలకు బుధవారం ఈ-క్రాప్ చేయించారు. ఇప్పటివరకు ఎంత శాతం మేర ఈ-క్రాప్ పూర్తయిందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

మరుగుదొడ్లకు జియోట్యాగింగ్



గ్రామ సచివాలయం వద్ద నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలిస్తున్న హెచ్‌ఆర్‌డీ కన్సల్‌టెంట్ సుధాకర్

తెర్లాం: మండలంలోని చీకటిపేట గ్రామ సచివాలయం వద్ద నిర్మించిన మరుగుదొడ్ల నాణ్యతా ప్రమాణాలను హెచ్‌ఆర్‌డీ కన్సల్‌టెంట్ సుధాకర్ బుధవారం పరిశీలించారు. మరుగుదొడ్లకు జియోట్యాగింగ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్న వాటికి జియోట్యాగింగ్ చేస్తున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు సర్పంచ్ మూడడ్ల పార్వతి, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

అంబఖండిలో 'వైఎస్సార్ పొలంబడి'



రైతులకు సూచనలు అందజేస్తున్న ఏఓ లక్ష్మునాయుడు

రేగిడి: మండలంలోని అంబఖండిలో ఏఓ మురళీకృష్ణ ఆధ్వర్యంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పుర్లి లక్ష్మునాయుడు వరి పొలంలో రైతులకు సాగుకు సంబంధించిన పలు సూచనలు అందజేశారు. కూలీల కొరత నివారణ, సేంద్రియ ఎరువుల వినియోగం, ఈ క్రాప్ నమోదు, తదితర అంశాలపై ఏఓ వివరించారు. కార్యక్రమంలో వీఏఏ కెంబూరు శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.